ప్రజల చేతిలో

www.ayudamdaily.com

ఆయుధం

The Common People's Voice

శనివారం | అక్టోబరు 17, 2026 | సంపుటి : 7 | సంచిక : 117 | పేజీలు : 2

హైదరాబాద్‌లో హ్యుందాయ్

కార్ల తయారీ పరిశ్రమ

- 4,276 మందికి ఉద్యోగాలు
- సీఎం రేవంత్ రెడ్డితో హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరింగ్ ఎండీ చాంగ్యో చో భేటీ

హైదరాబాద్, ఆయుధం:

కార్ల తయారీ పరిశ్రమ స్థాపించడానికి హైదరాబాద్ అనువైన ప్రాంతమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హ్యుందాయ్ ఇండియా సంస్థకు తెలిపారు. తెలంగాణలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి గారితో హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యోన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం సమావేశమైంది. "భౌగోళికంగా తెలంగాణ దేశంలో మధ్య భాగంలో ఉంది. దేశంలోని ఆరు ప్రధాన మెట్రో నగరాల్లో హైదరాబాద్ కాస్మోపాలిటన్ నగరంగా, అత్యంత సురక్షితమైనదిగా, జీవించేందుకు అత్యంత అనుకూలమైన నగరంగా గుర్తింపు పొందింది" అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఇక్కడి సానుకూల పరిస్థితులను వివరించారు. జహీరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ సమగ్ర గ్లోబల్ ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చారు. నిమ్జ్ లో రూ. 8,528 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న హ్యుందాయ్ కేంద్రం ద్వారా మొత్తం 4,276 ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించుకుంది. 678 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టును దశలవారీగా అభివృద్ధి చేయనున్నారు. ప్రాజెక్టు పురోగతిని హ్యుందాయ్ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి కి వివరించింది. రానున్న కొన్ని నెలల్లో ఈ కేంద్రానికి శంకుస్థాపనకు సిద్ధం చేయనున్నట్టు తెలిపారు. 2024లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు (మిగతా 2 లో..,)





భవానీమాతగా..

అమ్మవారు

- ఆరో రోజు శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

వరంగల్, ఆయుధం: వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీశరన్నవరాత్రులు ఆరవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం నిత్యాహ్నికం అనంతరం అమ్మవారిని భవాని మాతగా అలంకరించి పూజారాధనలు జరిపారు. ఎక్కడైతే భోగముందో అక్కడ మోక్షముండదు. ఎక్కడైతే మోక్షముంటుందో అక్కడ భోగముండదు. కానీ అమ్మవారి భక్తులకు భోగ మోక్షాలు రెండు కలుగుతాయని శాస్త్రం చెబుతున్నందున అమ్మవారిని భవానిగా అలంకరించడం జరిగినది. ఎందుకంటే అమ్మవారు శంకరుడికి భవాని రూపంలో సమస్త భోగాలనిస్తుందని శాస్త్రం చెబుతోంది. భవాని మాతగా అలంకరించిన అమ్మవారిని దర్శించుకోవడం వలన సమస్త భోగాలు కలుగుతాయి. ఈ రోజు అమ్మవారికి కాత్యాయని క్రమంలోను మరియు బోధాయనమహర్షిప్రోక్త నవరాత్రి కల్పాన్ని అనుసరించి ధూప్రహా క్రమంలోను పూజారాధనలు జరిపారు. అట్లాగే ఈ రోజు అమ్మవారికి గంధోత్సవం నిర్వహించారు. "గంధవతీ పృథివీ" అని వృథ్వీ తత్వం గంధానికి ఈ గంధోత్సవాన్ని అమ్మవారికి మనం జరుపడం వలన అమ్మవారి భక్తులకు భూములు, వ్యవసాయక భూములు, గృహాలు, సమస్తమైనభూ సంబంధమైన ఆస్తిపాస్తులు సమకూరుతాయి. భూసంబంధిత చికాకులు తొలిగిపోతాయి. సాయంకాలం సాలభంజిక సేవ నిర్వహించారు. అమ్మవారు అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకి (మిగతా 2 లో..)



నేడు అవార్డుల ప్రదానోత్సవం

- సీఎం రేవంత్‌కు టీజీఎఫ్‌డీసీ ఆహ్వానం

హైదరాబాద్, ఆయుధం; బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ 2026 అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ని కలిసిన వారిలో సినీ దర్శకుడు హరీష్ శంకర్, తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్, గాయకుడు నల్గొండ గద్దర్ ఉన్నారు. శనివారం శిల్పకళా వేదికలో ఈ అవార్డుల ప్రదానోత్సవం జరగనుంది.

బల్దియాలో బతుకమ్మ సంబురం

- జీడబ్ల్యూఎంసీ ప్రాంగణంలో అంబరాన్నంటిన వేడుకలు
- పూల సోయగాలతో.. సాంస్కృతిక వైభవంతో బతుకమ్మ సంబరాలు
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ
- కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, కమిషనర్ వెంకన్న



వరంగల్, ఆయుధం: గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు శుక్రవారం సాయంత్రం సంస్థ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా జరిగిన ఈ వేడుకల్లో కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, హన్మకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న దంపతులు, మహిళా ఉద్యోగులు, ఇతర సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు. ..: తరువాయి 2లో..)



పట్టభద్రుల పోరులో కమలం వ్యూహం

ఆలస్యమా? ఆచితూచి అడుగులా? 2 లో

- వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ కసరత్తు!
- కాంగ్రెస్, బీఆర్ఎస్ అగ్రవర్ణ అభ్యర్థుల ప్రకటనతో మారిన సమీకరణాలు!
- తెలంగాణలో రాజుకుంటున్న బీసీ వాదం.. కమలనాథుల నజరు వెనుకబడిన వర్గాలపైనేనా?
- సంఘ్ నేపథ్యం, సేవాతత్పరత కలిగిన డాక్టర్ వన్నాల వెంకటరమణ వైపే మెజారిటీ శ్రేణుల మొగ్గు!

హుస్నాబాద్‌లో నూతన కబడ్డీ అకాడమీ

- ప్రభుత్వ జీవో జారీ
- 40 మంది క్రీడాకారులకు వసతితో కూడిన అకాడమీ

హనుమకొండ, ఆయుధం: హుస్నాబాద్ నియోజకవర్గంలో క్రీడాభివృద్ధికి మరో ముందడుగు పడింది. రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ కృషితో హుస్నాబాద్ నియోజకవర్గంలో నూతన కబడ్డీ అకాడమీ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి మంజూరు చేస్తూ జీవో జారీ చేసింది. యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసి, గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించాలనే లక్ష్యంతో ఈ అకాడమీ ఏర్పాటు కానుంది.



జీవోలోని ముఖ్యాంశాలు:

- హుస్నాబాద్ నియోజకవర్గం, సిద్దిపేట జిల్లాలో నూతన కబడ్డీ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి.
- అకాడమీలో మొత్తం 40 మంది క్రీడాకారులకు అవకాశం కల్పించనున్నారు.
- ఇందులో 20 మంది బాలురు, 20 మంది బాలికలు ఉంటారు.
- బాలురు, బాలికలకు వేర్వేరుగా కబడ్డీ కోచ్‌లను నియమించనున్నారు.
- బాలురు, బాలికల కోసం వేర్వేరుగా వార్డెన్లతో పాటు గ్రౌండ్స్‌మెన్, స్వీపర్, సెక్యూరిటీ గార్డు సేవలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు.
- మొత్తం 8 సేవల నియామకానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.
- ఈ నియామకాలు ఔట్ సోర్సింగ్ విధానంలో చేపట్టనున్నారు.


క్రీడాకారులకు ప్రయోజనం

ఈ అకాడమీ ద్వారా హుస్నాబాద్ నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల యువ క్రీడాకారులకు కబడ్డీలో శిక్షణ పొందేందుకు అవకాశాలు మెరుగుపడనున్నాయి. బాలురు, బాలికలకు సమానంగా అవకాశం కల్పించడం ద్వారా క్రీడల్లో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు దోహదపడనుంది. హుస్నాబాద్ ప్రాంతంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ అకాడమీ ఏర్పాటు కీలక అడుగుగా నిలవనుంది. ఇప్పటికీ హుస్నాబాద్ నియోజకవర్గంలోని గ్రామాలు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ గుర్తింపు సాధించారు. కబడ్డీ అకాడమీ ఏర్పాటుకు హుస్నాబాద్ నియోజకవర్గంలోని పల్లెల్లో మట్టిలో మాణిక్యాలు వెలికి తీసి అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేయవచ్చని నియోజకవర్గ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

శృంగేరి శారదా పీఠంలో వీణ శారద దర్శనం

- అమ్మ వారిని దర్శించుకున్న మాజీ మంత్రి కొండా సురేఖ, మాజీఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు

వరంగల్, ఆయుధం: శ్రీ శృంగేరి పీఠాధిపతులు, జగద్గురువులు శ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి, శ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామి, అనుగ్రహ ఆశీస్సులతో శ్రీ శృంగేరి వరంగల్ శారదా పీఠంలో దసరా శరన్న వరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి... శుక్రవారం మూలా నక్షత్రం సందర్భంగా ప్రధానార్చకులు సంగమేశ్వర జోషి శారదా అమ్మవారిని చదువుల తల్లి సరస్వతి దేవిగా అలంకరించి సరస్వతి, ఆవాహనం సరస్వతి పూజ చేసి మహా మంగళహారతి ఇచ్చారు. డాక్టర్ బండారు సుమంత్ కుమార్ సుకన్య దంపతులు సరస్వతి హోమం నిర్వహించారు. మాజీ మంత్రి, వరంగల్ తూర్పు శాసనసభ్యురాలు కొండా సురేఖ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు గోపాల నవీన్ రాజ్, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు దంపతులు వీణా శారదను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరందరికీ ప్రధాన అర్చకులు సంగమేశ్వర జోషి వేదోక్త మహా ఆశీర్వచనం చేశారు. వరంగల్ మహానగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో చేతిలో వీణ ధరించిన చదువుల తల్లి సరస్వతి దర్శనం చేసుకుని తన్మయత్వం చెందారు. మూల నక్షత్రం కావడంతో విద్యార్థులకు, చిన్నారులకు సరస్వతి అమ్మ పూజ చేసిన నోట్ బుక్స్, పెన్నులను అర్చకులు పంపిణీ చేసి సరస్వతి కంకణం కట్టారు. అలాగే భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు..



శృంగేరి శారద సేవా సమితి సభ్యులు పి.దేవేందర్, కొమురయ్య, భాస్కర్ రామారావు, రవీందర్, కే.భాస్కర్ రావు, మున్నా, రాజేంద్రప్రసాద్, శ్రీధర్ లు భక్తులకు సేవలు అందించారు. మాజీ కార్పొరేటర్ లీలావతి, కాంగ్రెస్ నాయకులు చిప్ప వెంకటేశ్వర్లు, సత్యనారాయణ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌తో వరంగల్

నగర సమగ్రాభివృద్ధికి చర్యలు

- అభివృద్ధి పనుల ప్రతిపాదనలు, డీపీఆర్‌లను వివరించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

వరంగల్, ఆయుధం: రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి, సీడీఎంఏ డాక్టర్ టి.కె. శ్రీదేవి శుక్రవారం హైద్రాబాద్ నుండి రాష్ట్రంలోని మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద చేపట్టనున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా హన్మకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న పాల్గొని మాట్లాడుతూ... గ్రేటర్ వరంగల్ నగరంలో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద ప్రతిపాదించిన అభివృద్ధి పనులు, వాటికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికల వివరాలను వెల్లడించారు. నగరంలో ఆర్థిక కార్యకలాపాల అభివృద్ధి, రవాణా ఆధారిత పట్టణాభివృద్ధి, ప్రాంతీయ ప్రణాళిక, పట్టణ పునరుద్ధరణ, తాగునీరు, పారిశుద్ధ్యం, నగర ప్రాంతాల పునరాభివృద్ధి వంటి కీలక అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలను వివరించారు. నగర భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సిపిఓ అజిత్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మహేందర్, రవికుమార్, సంజయ్ కుమార్, భీమ్‌రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



22 నుంచి లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్

హనుమకొండ, ఆయుధం: జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 22 నుంచి నవంబర్ 4 వరకు నిర్వహించనున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ ను విజయవంతం చేయాలని రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ విజయ నిర్మల సూచించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జిల్లా ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్లతో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధి లక్షణాలను గుర్తించడం, వ్యాధి వ్యాప్తిని అరికట్టడం, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి అంశాలపై ఆమె దిశానిర్దేశం చేశారు. అక్టోబర్ 22 నుంచి నవంబర్ 4 వరకు ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు తమ పరిధిలోని ఇళ్లను సందర్శించి ఇంటింటి సర్వే నిర్వహించాలని సూచించారు.

బతుకమ్మ, దసరా కు సర్వం సిద్ధం చేయాలి

- భక్తులకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలి
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న



వరంగల్ కలెక్టరేట్ ప్రారంభించాలి

ఎమ్మెల్యే కొండా సురేఖకు వినతి

వరంగల్, ఆయుధం: వరంగల్ లో నూతనంగా నిర్మించిన కలెక్టరేట్ ను వెంటనే ప్రారంభించాలని కోరుతూ ఎమ్మెల్యే కొండా సురేఖకు విద్యావంతుల వేదిక ప్రతినిధులు వినిపత్రం సమర్పించారు. నగరంలో పబ్లిక్ పార్క్, సాహిత్య కళాభవన్, బస్సు డిపో, ఐ టి టవర్, ఆఫీసర్స్ క్లబ్, కేఎంసీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లోని అన్ని ఎక్విప్మెంట్స్ ని ఎప్పటికప్పుడు మరమ్మతు చేసి, ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, నిర్మాణంలో ఉన్న బస్సు స్టేషన్ పూర్తి చేయాలని, పోచమ్మ మైదాన్ లో ప్రారంభంలో ఆగిపోయిన మినీ రవీంద్ర భారతి నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. నగరంలో ఒక పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ను నూతనంగా ఏర్పాటైన వరంగల్ విద్యావంతుల వేదిక, కన్వీనర్, కోకన్వీనర్స్, కార్యవర్గ సభ్యులు కలిసి పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపచ్చే పరిష్కరించాలని కోరినారు, ఓ సిటీలో ఖాళీగా ఉన్న కూడా స్థలములో పబ్లిక్ గార్డెన్ లాంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. వరంగల్ నగరంలో తగిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్, ప్రముఖ నాయకులు నవీన్ రాజు, వరంగల్ విద్యావంతుల వేదిక కన్వీనర్ నిమ్మకాయల సదానందం, కోకన్వీనర్ కోన్ రెడ్డి మల్లారెడ్డి, కోకన్వీనర్ చింతం సారంగపాణి, సభ్యులు శ్రీనివాసరావు, మధార్ విశ్రాంత డిగ్రీ లెక్చరర్ పాల్గొన్నారు.



నర్మెట్టలో గిరిజన భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలి

మండల తహసీల్దార్‌కు ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు వినతి

నర్మెట్ట, ఆయుధం: జనగామ జిల్లా నర్మెట్ట మండల కేంద్రంలో గిరిజన భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) జనగామ జిల్లా అధ్యక్షులు కొర్ర రాజేందర్ నాయక్ మండల తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో గిరిజన భవన్ నిర్మిస్తే గిరిజన సమాజ సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు, సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహించేందుకు ఉపయోగకరంగా ఉంటుందని నాయకులు తెలిపారు. గిరిజనుల ఐక్యత, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు గిరిజన భవన్ అవసరమని పేర్కొంటూ, అధికారులు స్పందించి భవన్ నిర్మాణానికి తగిన స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ రాజు నాయక్, గిరిజన సర్పంచులు మహేందర్ నాయక్, శ్రీను నాయక్, లకుపతి నాయక్, సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో హ్యుందాయ్
కార్ల తయారీ పరిశ్రమ

(మొదటి పేజీ తరువాయి..)

సమావేశాల సందర్భంగా, తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రతినిధి బృందం హ్యుందాయ్ మోటార్స్ ప్రతినిధులతో సమావేశమైంది. అనంతరం, 2025 జూన్‌లో హ్యుందాయ్ ప్రతిపాదించిన ప్రతిష్టాత్మక ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు మంత్రివర్గ పారిశ్రామిక, పెట్టుబడుల ప్రోత్సాహక ఉపసంఘం ఆమోదం తెలిపింది. తెలంగాణలో కార్ల తయారీ పరిశ్రమను స్థాపించేందుకు రాష్ట్రం అత్యంత అనుకూలమైన ప్రదేశమని ముఖ్యమంత్రి గారు పునరుద్ఘాటించారు. ప్రత్యేక మొబిలిటీ క్లస్టర్లు, రహదారి, విమాన, రైలు మార్గాల ద్వారా బలమైన రవాణా మౌలిక సదుపాయాలు, భవిష్యత్తులో ఓడరేవులతో హైస్పీడ్ రవాణా అనుసంధానాన్ని అభివృద్ధి చేసే ప్రణాళికలు రాష్ట్రానికి మరింతగా అనుకూలంగా మారుతాయని వివరించారు. తయారీ రంగం అభివృద్ధి కోసం పెరిఅర్బన్ రీజియన్ (PURE) వంటి ప్రణాళికాబద్ధమైన ప్రాంతీయ అభివృద్ధి నమూనాల ద్వారా తెలంగాణ వేగవంతమైన పారిశ్రామిక విస్తరణకు సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రపంచ స్థాయి సౌకర్యాలతో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించాలన్న ప్రభుత్వ దార్శనికతను ముఖ్యమంత్రి వివరించారు. 2026లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాల్సిందిగా హ్యుందాయ్ నాయకత్వ బృందాన్ని ఆహ్వానించారు. HMIE మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ చాంగ్యోన్ చో మాట్లాడుతూ, "తెలంగాణ అభివృద్ధి ప్రస్థానంలో మా భాగస్వామ్యాన్ని కొనసాగిస్తాం" అని తెలిపారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



బతుకమ్మ పాటల పోటీలు ప్రారంభం

వరంగల్, ఆయుధం: వరంగల్ రంగసాయిపేటలో గల జనతా పరపతి సంఘం ఆవరణలో కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో బతుకమ్మ పాటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనతా పరపతి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కెడల మల్లేశం, పోశాల మల్లికార్జున్, సహాయ కార్యదర్శి టీవీ రఘురాం, కోశాధికారి హనుమాన్ల రమేష్, కార్యవర్గ సభ్యులు హాజరై డ్రా తీసి ఈ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో జనతా పర్చస్ సంఘం ప్రధాన కార్యదర్శి పోశాల మల్లికార్జున్, సహాయ కార్యదర్శి టీవీ రఘురాం, కోశాధికారి హనుమాన్ల రమేష్, నాగవెల్లి రామ్ మనోహర్, తోట మహేందర్, కాకతీయ సేవా సమితి అధ్యక్షులు మండల నరసింహ రాములు, గౌరవ న్యాయ నిర్ణీతలు కత్తి సాంబయ్య, జక్కం దామోదర్, ఏలుగు రవికుమార్, కోల రాము, బొలిశెట్టి కమలాకర్, కోక సత్యనారాయణ, బొల్లపల్లి పెద్దరాజు, రాజశేఖర్, పోటీల్లో పాల్గొన్న 12 గ్రూపు సభ్యులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల పోరులో
కమలం వ్యూహం
ఆలస్యమా? ఆచితూచి అడుగులా?



- వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ కసరత్తు!
- కాంగ్రెస్, బీఆర్ఎస్ అగ్రవర్ణ అభ్యర్థుల ప్రకటనతో మారిన సమీకరణాలు!
- తెలంగాణలో రాజుకుంటున్న బీసీ వాదం.. కమలనాథుల నజరు వెనుకబడిన వర్గాలపైనేనా?
- సంఘ్ నేపథ్యం, సేవాతత్పరత కలిగిన డాక్టర్ వన్నాల వెంకటరమణ వైపే మెజారిటీ శ్రేణుల మొగ్గు!

రాష్ట్ర రాజకీయాల్లో కీలకమైన ఉమ్మడి వరంగల్ ఖమ్మం నల్గొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల రణరంగం రోజురోజుకూ వేడెక్కుతోంది. ఇప్పటికే అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేసి, క్షేత్రస్థాయిలో ఓటర్ల నమోదు ప్రక్రియతో పాటు సన్నాహక సమావేశాలతో దూకుడు ప్రదర్శిస్తున్నాయి. అయితే, క్షేత్రస్థాయిలో ప్రధాన పార్టీలన్నీ పోటాపోటీగా ప్రచారం సాగిస్తున్న తరుణంలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి ప్రకటనలో ఇంకా స్పష్టత ఇవ్వకపోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ముందుకెళ్తుంటే బీజేపీ వెనుకబడిందన్న భావన స్థానిక శ్రేణుల్లో వ్యక్తమవుతున్నప్పటికీ, దీని వెనుక కాషాయ దళం పక్కా రాజకీయ వ్యూహం రచిస్తోందన్న విశ్లేషణలు బలంగా వినిపిస్తున్నాయి.

ప్రత్యర్థుల ఎత్తులకు పైఎత్తులు రచిస్తూ బీసీ అస్త్రంపై బీజేపీ దృష్టి సారించిందని తెలుస్తోంది. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ అగ్రవర్ణ సామాజిక వర్గాలకు చెందిన నేతలను బరిలోకి దించాయి. దీంతో బీజేపీకి సామాజిక సమీకరణాల పరంగా అద్భుతమైన అవకాశం కలిసివచ్చినట్లయింది. ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో బీసీ ఉద్యమం విస్తృతంగా చర్చనీయాంశమవుతోంది. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ నేతనే ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెడతామని గతంలోనే పార్టీ అగ్రనాయకత్వం ప్రకటించింది. ఆ మాటకు కట్టుబడి ఉన్నామని చాటిచెప్పేందుకు, క్షేత్రస్థాయిలో వెనుకబడిన వర్గాల ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ఈ పట్టభద్రుల స్థానాన్ని బీసీ అభ్యర్థికే కేటాయించాలన్న ఆలోచనతో అధిష్ఠానం తీవ్ర కసరత్తు చేస్తోంది. అగ్రవర్ణ అభ్యర్థులతో తలపడుతున్న ప్రధాన పార్టీలకు చెక్ పెట్టాలంటే, సమర్థుడైన బీసీ విద్యావంతుడిని బరిలోకి దింపడమే సరైన వ్యూహమని పార్టీ నాయకత్వం భావిస్తోంది.అందులో భాగంగా ఆశావహుల తాకిడి క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణకు బీజేపీ శ్రీకారం చుట్టింది. ఈ స్థానం నుంచి పోటీ చేసేందుకు బీజేపీలోని పలువురు నేతలు దరఖాస్తు చేసుకోగా, ఇతర పార్టీల్లో అవకాశాలు దక్కని కొందరు నేతలు కూడా బీజేపీ వైపు చూస్తున్నట్లు సమాచారం. అయితే, బయటి వ్యక్తుల కంటే పార్టీకి అంకితభావంతో పనిచేసిన నిఖార్సైన సిద్ధాంతవాదులకే ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది. ఇందులో భాగంగానే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీ శ్రేణులు, నేతల నుంచి బీజేపీ నాయకత్వం రహస్యంగా అభిప్రాయ సేకరణను చేపట్టింది. ఈ అభిప్రాయ సేకరణలో ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలతో సుదీర్ఘ అనుబంధం ఉన్న డాక్టర్ వన్నాల వెంకటరమణ పేరు ముందంజలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. రేసులో ముందువరుసలో డాక్టర్ వన్నాల వెంకటరమణ
వరంగల్ ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో సుపరిచితులైన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు పెద్ద కుమారుడైన డాక్టర్ వన్నాల వెంకటరమణ అభ్యర్థిత్వాన్ని మెజారిటీ శ్రేణులు బలంగా బలపరుస్తున్నాయి.

విద్యా నేపథ్యం, సంఘ్ భావజాలం కలిగిన కుటుంబం కావడంతో కలిసి వచ్చే అవకాశం లేకపోలేదు. ఉన్నత విద్యావంతుడైన డాక్టర్ వన్నాల వెంకటరమణ పీహెచ్‌డీ పూర్తి చేసి ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. మొదట్నుంచీ ఆరెస్సెస్ నేపథ్యం ఉన్న కుటుంబం కావడంతో సిద్ధాంత నిబద్ధత కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. గత నాలుగేళ్లుగా పూర్తిస్థాయిలో తన వృత్తిని పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.
రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా ఈ మూడు ఉమ్మడి జిల్లాల్లో గణనీయమైన సంఖ్యలో ఉన్న బలమైన బీసీ పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం ఆయనకు ప్రధాన అనుకూలాంశంగా కూడా కలిసిరావచ్చు అనే అభిప్రాయం కూడా పార్టీ శ్రేణులు వ్యక్తపర్చుతున్నారు. రాజకీయాలకే పరిమితం కాకుండా 'వాక్' స్వచ్ఛంద సంస్థ ద్వారా దాదాపు 300 పేద కుటుంబాలకు ప్రతినెలా 10 కేజీల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. అనాథ పిల్లల చదువులకు ఫీజుల చెల్లింపు, పేద కుటుంబాలకు అత్యవసర వైద్య ఖర్చులకు అండగా నిలవడం వంటి సేవా కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రజాదరణ సంపాదించుకున్నారు. ఒకవేళ అధిష్ఠానం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, బీసీ మహిళను బరిలోకి దించాలనే ఆలోచన చేస్తే.. డాక్టర్ వన్నాల వెంకటరమణ సతీమణి, ఉన్నత విద్యావంతురాలైన పీహెచ్‌డీ ప్రొఫెసర్ పాము పావన పేరును పరిగణనలోకి తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. మహిళా పట్టభద్రులను ఆకర్షించేందుకు, విద్యారంగ అనుభవం ఉన్న మహిళా మేధావిని రంగంలోకి దించడం వ్యూహాత్మకంగా కలిసివస్తుందని పార్టీ శ్రేణులు విశ్లేషిస్తున్నాయి.
ఏళ్ల తరబడి ఎన్ని ప్రలోభాలు ఎదురైనా బీజేపీ సిద్ధాంతాలకే కట్టుబడి ఉన్న నేతగా, పట్టభద్రులను ప్రభావితం చేయగల విద్యావేత్తగా డాక్టర్ వన్నాల వెంకటరమణ అభ్యర్థిత్వం అన్నివిధాలా సరితూగుతుందని స్థానిక బీజేపీ వర్గాలు ముక్తకంఠంతో స్పష్టం చేస్తున్నాయి. అధికారంలోకి వస్తే బీసీ సీఎం హామీకి విశ్వసనీయత పెరగాలన్నా, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అగ్రవర్ణ అభ్యర్థులకు గట్టి సమాధానం ఇవ్వాలన్నా బీజేపీ నుంచి బీసీ విద్యావంతుడైన అభ్యర్థే బరిలో ఉండాలని కేడర్ గట్టిగా కోరుతోంది. మరి కాషాయ దళాధిపతులు బీసీ నినాదాన్ని అందిపుచ్చుకుని ఈ సీటును దక్కించుకుంటారా? లేక ఊహించని నిర్ణయం తీసుకుంటారా? అనేది త్వరలోనే తేలనుంది.

మోకాళ్ల పై నిలబడి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన

వరంగల్, ఆయుధం: నేషనల్ హెల్త్ మిషన్ శాశ్వత ఉద్యోగులతో సమానంగా నేషనల్ హెల్త్ మిషన్ లో 78 క్యాడర్ ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, సమాన హక్కులు కల్పించాలని ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా పోచమ్మ మైదాన్ సర్కిల్ వద్ద ఎన్ హెచ్ ఎం లు నిరవధిక సమ్మె సందర్భంగా నాలుగో రోజు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 13 నుండి రాష్ట్రవ్యాప్తంగా ఎన్.హెచ్.ఎం నిరవధిక సమ్మె చేపట్టినట్లు తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా



ప్రభుత్వ ఉద్యోగులకు దీటుగా పనిచేసినా ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. తెలంగాణలో రాష్ట్రవ్యాప్తంగా 17వేల మంది ఉద్యోగులము పని చేస్తున్నామన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా రెగ్యులరైజ్ కోసం ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు. మిగిలిన ఏడు రాష్ట్రాల్లో రెగ్యులరైజ్ చేసినప్పుడు తెలంగాణలో ఎందుకు చేయరని ప్రశ్నించారు. ప్రభుత్వం హక్కులు కల్పిస్తూ ఆర్టికల్ 14,16,39 డి ప్రకారం సమాన పనికి సమాన హక్కులు, ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు. నిత్యవసర ధరల పెరుగుదల వల్ల చాలీచాలని జీతంతో జీవనం కొనసాగిస్తున్నామన్నారు. మహిళ ఉద్యోగులకు 180 రోజులు జీతంతో కూడిన సెలవులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత , ఆరోగ్య బీమా ప్రతి ఉద్యోగికి కల్పించాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎన్ హెచ్ ఎం లను గుర్తించి రెగ్యులరైజ్ చేసి, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు.





భవానీ మాతగా అమ్మవారు

(మొదటి పేజీ తరువాయి..)

18 మెట్లపై ఒక్కొక్క శక్తి అమ్మవారిని ప్రశ్నిస్తుంటే వాటికి అమ్మవారు సమాధానం చెప్తూ ఒకొక్క మెట్టు అధిరోహిస్తూ నమస్తే బ్రహ్మాండాన్ని అధిరోహించింది. ఆ బ్రహ్మాండాన్ని అధిరోహించిన ఆ జగన్మాతను దర్శించడం వల్ల సకలైశ్వర్య సంపత్తి, సకల రోగ నివృత్తి రాజద్వారము నందు. రాజ కార్యములందు విజయప్రాప్తి కలుగుతుందని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. శుక్రవారం కూడా కావడంతో ఉదయం నుండి భక్తులు అమ్మవారి దర్శనమునకు పోటెత్తారు. ఉభయదాతలుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ మాజీ ఎం.ఎల్.ఏ దాస్యం వినయభాస్కర్ రేవతి, కసిరెడ్డి సోమిరెడ్డి కళావతి, మహేశ్వర్ రెడ్డిగీతా, వేముల రోజ, దంతాల అనీష్యలు వ్యవహరించారు.
అమ్మవారిని వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకన్న కుటుంబ సమేతంగా, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఎన్.ఈ దుర్గాప్రసాద్ తదితరులు దర్శించుకున్నారు. పూజానంతరం మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి ప్రసాదములు అందజేశారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాట్లు మరియు ప్రసాద వితరణలు దేవాలయ చైర్మన్ డాక్టర్ శివ సుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు కమటం వేణుగోపాల్, గాధే శ్రవణ్ కుమార్ రెడ్డి, రమేష్ చంద్ భంగ్, మాడిశెట్టి సతీష్, కారంగుల సురేష్ బాబు తదితరులు పర్యవేక్షించారు.

బల్దియాలో బతుకమ్మ సంబురం

- జీడబ్ల్యూఎంసీ ప్రాంగణంలో అంబరాన్నంటిన వేడుకలు
- పూల సోయగాలతో.. సాంస్కృతిక వైభవంతో సంబరాలు
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ
- కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్,కమిషనర్ వెంకన్న



వరంగల్, ఆయుధం: గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు శుక్రవారం సాయంత్రం సంస్థ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా జరిగిన ఈ వేడుకల్లో కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, హన్మకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న దంపతులు, మహిళా ఉద్యోగులు, ఇతర సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లతో లయబద్ధంగా నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. పూల సోయగాలు, జానపద గీతాలు, మహిళల ఆటపాటలతో జీడబ్ల్యూఎంసీ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, బతుకమ్మ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిలో లభించే పూలను పూజిస్తూ, ప్రకృతితో మానవ జీవితానికి ఉన్న అనుబంధాన్ని చాటిచెప్పే విశిష్టమైన పండుగ బతుకమ్మ అని తెలిపారు. బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, మహిళల ఆత్మగౌరవం, ఐక్యత, కుటుంబ అనుబంధాలు, సామాజిక సమైక్యతకు ప్రతిబింబమని అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయాన్ని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడటంతోపాటు మహిళల్లో ఐక్యతా భావాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. బతుకమ్మ పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ మహిళా ఉద్యోగులు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

జాతీయ ఆయుష్ మిషన్ లో
పదీ ఉద్యోగాలు

ఈ నెల31 వరకు దరఖాస్తుల స్వీకరణ

ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ సునీత

ములుగు, ఆయుధం: ములుగు జిల్లాలో జాతీయ ఆయుష్ మిషన్ కింద ప్రజారోగ్య కార్యక్రమం అమలులో భాగంగా 10 ఉద్యోగాలను పొరుగు సేవల ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ సునీత తెలిపారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ఎంపిక కమిటీ ద్వారా నియామక ప్రక్రియ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నాలుగు ఆయుష్ వైద్యాధికారి పోస్టులకు నెలకు రూ.40,000, ఒక ఫార్మసిస్ట్ పోస్టుకు నెలకు రూ.15,000, ఒక యోగా శిక్షకుడి పోస్టుకు నెలకు రూ.28,000, మూడు బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్త పోస్టులకు నెలకు రూ.15,000 చొప్పున వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. ఒక సైకోసోషియల్ కౌన్సిలర్ పోస్టుకు అవసరమైనప్పుడు సేవలు అందించే ప్రాతిపదికన ఒక్కో సందర్శనకు రూ.500 చెల్లించనున్నట్లు, సంవత్సరానికి కనీసం 200 సందర్శనలు ఉండనున్నట్లు పేర్కొన్నారు.



23వ డివిజన్‌లో అన్నదానం

వరంగల్, ఆయుధం: శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా 23వ డివిజన్ కొత్తవాడ లోని పలు కమిటీలు ఏర్పాటు చేసిన అమ్మవార్లను మాజీ కార్పొరేటర్ యెలుగం లీలావతి సత్యనారాయణ దర్శించుకున్నారు. తదనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.



రంగలీల మైదానం వాకర్స్ టూర్
పరపతి సంఘం కమిటీ ఎన్నిక

వరంగల్, ఆయుధం: వరంగల్ నగరంలో గల రంగ లీలా మైదానం వాకర్స్ టూర్ పరపతి సంఘం 8వ మహాసభ అమ్మవారి పేట సమ్మక్క సారమ్మ సన్నిధానం యందు మహాసభ సమావేశం శుక్రవారం జరిగింది. గత సంవత్సరము లాభ నిలువలు ఖర్చులు పై కార్యదర్శి నివేదిక సమర్పించారు. గత సంవత్సరం పాలకవర్గం జమ్మూ కాశ్మీర్ టూర్ విజయంతో చేసిన పాత పాలకవర్గానికి సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. జమ్మూ కాశ్మీర్ టూర్ సక్సెస్ చేసిన సలహాదారుడు బొమ్మల అంబేద్కర్ కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరము నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బైరి నాగరాజు, ఉపాధ్యక్షుడిలు కన్నబోయిన రవి యాదవ్, గుర్రపు కిరణ్, ప్రధాన కార్యదర్శి కదారి కుమార్, సహకార దర్శి కోదాటి శ్రీధర్, ఆర్గనైజర్స్ తుమ్మ సాంబమూర్తి, కోరబోయిన వీరేశం, గౌరవ అధ్యక్షులు గుడిమల్ల మోహన్, గౌరవ సలహాదారులుగా బొమ్మల అంబేద్కర్, కస్తూరి రాజు, తాళ్ల కుమార్ ను ఎన్నుకున్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695